# యాన్యువల్ లీవ్

'చచ్చిపోవటం—పోనీ కనీసం జబ్బు నయంకాకపోవటం ఖాయమైనప్పుడు—ఎందుకీ ప్రాకులాట—స్వేచ్ఛగా నాలుగు రోజులు తిరుగుదామని ఇలా వచ్చాను. పర్మిషన్ తీసుకొనే వచ్చానులే!' లేవబోయాడు. మళ్లీ చెప్పాడు 'హేమ్‌సక్సేనాను చూడాలి—వీలుంటే సిమ్లా వెళతాను' లేచాడు.

'నో, నో, నాకు గెస్టుగా వుండాలి, ప్లీజ్' చేయిపట్టుకొన్నాడు రాం. రాం దృష్టిపథంలో మెరుపులా మెరిసి, ఉరుంలా ఉరిమి, పిడుగులా పడి, వర్షంలా వెలిసిపోయింది, హేమ్‌సక్సేనా!

రాం, అతని ప్రియురాలు, కాబోయే భార్య సుధతో బీచ్‌లో, కూర్చున్నప్పుడు విశ్వం కనిపించాడు. విశ్వం ఆరోగ్యం పూర్తిగా క్షీణించిపోయింది.

రాం, విశ్వం ఎలా స్నేహితులో అలాగే సుధారాణి, హేమ్‌సక్సేనా కూడా స్నేహితురాండ్రు. వీళ్లు నలుగురూ పరస్పరం పరిచయస్థులు. పైపెచ్చు కొద్దో గొప్పో స్నేహితులు. ఈ స్నేహితం మొదట సిమ్లా మిలిటరీ హాస్పిటల్‌లో పుట్టింది. అక్కడే గబగబా పెరిగింది. ఆమధ్య కొంతకాలం దాని పెరుగుదల ఆగిపోయింది. కొంత మారి

పోయింది. ఆ మార్పులు విచిత్రమైంది కాదు. సహజమైంది. ఇప్పుడు రాం సుధను పెళ్లాడటానికి బొంబాయి వచ్చాడు.

సిమ్లాలో సుధా హేమ్ నర్సింగ్ ఆఫీసర్స్. రాం విశ్వం మిలిటరీ పేషంట్స్. తనకు తెలియని జబ్బు బాగుచేయించు కొనటానికి హాస్పిటల్లో చేరిన విశ్వం, హేమ్ ఆకర్షణకు లోనయ్యాడు. విరిగినచేయి బాగు అయ్యేందుకు వచ్చిన రాం వైపు మొగ్గింది హేమ్. అప్పటిలో సుధ వికసించని పుష్పం.

చేయి నయం అయ్యాక కెప్టెన్ రాం కిషన్‌ని పూనా యూనిట్‌కు పోస్టుచేశారు. తన జబ్బు టి.బి. అని తెలిసిన తర్వాత విశ్వంని ఔంధు హాస్పిటల్‌కు పంపించారు. ఆపైన రెండేళ్లకు సుధను పూనా మిలిటరీ హాస్పటల్లో నర్సింగ్ ఆఫీసరుగా బదిలీచేశారు. పూనాలో ఉంటున్న సుధకు రాంకూ మధ్య పూర్వ పరిచయం మరల మారాకు తొడిగింది. సన్నిహితులయ్యారు.

కొంత కాలంగా హేమ్‌సక్సేనా రాం కిషన్‌ల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. సంవత్సరక్రితం సుధ పూనా వచ్చాక ఆ సంబంధం తెగిపోయింది. హేమ్ ఇంకా సిమ్లా లోనేవుంది.

ఔంధు మిలటరీ హాస్పిటల్‌లో చేరాక హృదయం చంపుకో లేక మమతను త్రోసివేయలేక, హేమను ప్రేమను అర్థిస్తూ విశ్వం ఎన్నో లేఖలు వ్రాశాడు. సమాధానం పొందలేక బాధతో విలపించిపోయాడు. విశ్వం హేమను కాచుకొం టుంటే, హేమ్ రాంను ప్రేమిస్తుంది. రాం సుధను వాంఛి స్తున్నాడు. సుధకు విశ్వం అంటే భయం, అసహ్యం.

# 2

గార్డెన్ హోటల్. టేబిల్ చుట్టూ, రాం సుధా, విశ్వం. టేబిల్ మీద డిన్నర్ బ్రాందీ బాటల్స్, సోడాలు వున్నాయి. బ్రాంది రెండు గ్లాసుల్లో పోసి కొద్దిగా సోడా కలిపాడు తీసుకోమని విశ్వంతో చెప్పాడు రాం.

'మరి సుధ?' అడిగాడు విశ్వం.

'ఆమె తీసుకోదు, ఇంకా అలవాటుకాలేదు' రాం.

'ఇక అలవాటు కాదు' చెప్పింది సుధ.

రాం, విశ్వం రెండు క్షణాలలో నాలుగు బాటల్సు పూర్తి చేసి డిన్నర్‌కు ఉపక్రమించారు.

సుధ సిగ్గుపడుతూవుంది. ఆ సిగ్గు చీరకు అందం కలిగించింది.

హేమ్ సిగ్గుపడితే వింతగా ఉంటుంది. ఆమెకు చీరె అందంగా ఉండదు. చీరె లేకుంటేనే బాగుంటుంది. యూనిఫారంలోనే ఆమె సహజంగా ఉంటుంది.

రాంకిషన్ దృష్టిలోంచి హేమ్ తొలగిపోవటం లేదు. ఆమె ఒక్కతె అనాయాసంగా రెండు బ్రాందీ బాటల్స్ పూర్తి చేసి ఏమీ ఎరుగనట్టు మామూలుగా వుంటుంది.

వాళ్లిద్దరు డిన్నర్‌తో యుద్ధం చేస్తున్నారు. నంజినంజి కొంచెం కొంచెం తింటూవుంది సుధ. సిగ్గుసిగ్గుగా భయం భయంగా కొత్త కొత్తగా.

'నాకో డౌట్' విశ్వం.

'ఊ!' రాం.

'మీ పెళ్లెప్పుడు?'

'త్వరలోనే.'

సుధ పూర్తిచేసింది. వాళ్లిద్దరి డిన్నరు పూర్తికావచ్చింది. అప్పటికే బ్రాందీ పూర్తిగా మత్తెక్కించింది. చేతలూ, మాటలూ తడబడుతున్నాయి.

'మిస్ హేమ మిమ్మల్ని ప్రేమించింది' విశ్వం చెప్పాడు.

'నిజమే' రాం తలూపాడు.

'అందకత్తె, చాలా అందకత్తె!'

'నిజమే' అంగీకరించాడు రాం.

సుధ వినలేకపోయింది.

'మంచి పరసనాలిటీ!'

'నిజమే!' రాం వళ్లంతా అంగీకరించింది.

సుధ తల దిమ్మెత్తిపోతూ వుంది.

'ఆమెకీ అప్సరసులకీ అట్టే తేడాలేదు.'

'నిజమే!'

'నిన్ను పెళ్లాడుతుందట.'

'నన్నా?'

'ఆఁ!'

'అయితే పెళ్లాడాల్సిందే—ఇవాళే—వీలులేదా?—రేపు—ఖచ్చితంగా రేపు!'

సుధకు పిచ్చెక్కినట్లు అయింది. అక్కడ కూర్చోలేకపోతోంది.

'మరి సుధ సంగతి' విశ్వం అడిగాడు.

'సుధా! సరే! సుధనున్నూ ఇద్దరినీ ఏం—నీకు కోపమా?'

'నాకే? నాకేం కోపం టి.బి. పేషంటుకి' సుధ పట్టరాని కోపంతో వూగిసలాడిపోతూ వుంది.

‘విశ్వం! ఒకళ్లను పెళ్లాడాలి ఎవరినైనా సరే!, ఒకరిని—సరేనా?’

‘వీల్లేదు.’

‘ఏం? ఎందుకు వీల్లేదు? పెళ్లాడాల్సిందే! అంటే! ఎవరు కావాలి సుధా? సక్సేనా? తెల్చుకో, నీ యిష్టం హేమ్‌నే చేసుకో.’

‘వద్దు.’

‘మరి సుధ కావాలా?’

సుధ చివాలున లేచి, కుర్చీని పడేచి, చరచరా నడచి, తన గదిలోకి పోయి, తలుపువేసుకొని, బోల్టువేసి, పడకమీద పడి ఆవురుమని ఏడ్చింది.

# 3

ఉదయం రోడ్డుమీద నడుస్తున్నాడు విశ్వం, ప్రక్కనే టాక్సీ ఆగింది, తూలుతూ స్త్రీ దిగింది హేమ్‌సక్సేనా.

‘విశ్వం నువ్విక్కడెందుకున్నావ్?’ యథాలాపంగా అడిగింది.

‘నువ్వు’ అడిగాడు. ఆశ్చర్యంనుంచి ఇంకా కోలుకోలేదు.

‘పూనా వెళ్లాను. రాంకిషన్ లేడు. బొంబాయి వచ్చాడని విన్నాను. వచ్చాను.’

‘యాన్యువల్ లీవుమీద వచ్చావా?’

‘ఆc?’

‘వాళ్లూ అంతే! నాకే యాన్యువల్ లీవు లేంది?’

‘అంటే?’

'ఏం లేదు? రాం కనిపించాడా?'

'ఆఁ!'

'ఎక్కడ?'

'చెబుతాను.'

ఇద్దరూ టాక్సీ ఎక్కారు. రాంకిషన్‌గూర్చి విశ్వం ఆరోగ్యంగూర్చి, హేమ్ ఉద్యోగంగూర్చి చాలాసేపు సంభాషణ సాగింది.

ఆమె తూలుతూ మాట్లాడుతూ వుంది. విస్కీ వాసన బాగా వస్తుంది. ఆమె మత్తుగా వళ్లు తెలియకుండా మాట్లాడుతూవుంది.

టాక్సీ ఆగింది. ఆమె దిగింది. 'రండి' అంది. టాక్సీవాడిని పంపించింది. లోపలకి నడిచింది. రూం అంతా విస్కీ వాసన కొట్టింది. టేబిల్ మీద ఖాళీసీసాలు! గదంతా గందరగోళంగా వుంది.

టేబిల్ సొరుగులోంచి విస్కీబాటల్ తీసింది. రెండు గ్లాసుల్లో పోసింది. సోడా కలిపింది. తీసుకోమంది. వద్దన్నాడు. బలవంతం చేసింది. అక్కర్లేదని గట్టిగా వాదించాడు. రెండు పెగ్గ్‌లూ తనే పుచ్చుకొంది.

'రాత్రంతా నిద్ర లేదు' చెప్పింది.

'ఎందువల్ల?'

'నిద్రరాలేదు. బుర్ర పాడయింది. పాడు ఆలోచనలు రాత్రంతా విస్కీ బాగా తాగాను. వళ్లు తెలియడం లేదు.'

విశ్వం అది తెలుసుకొన్నాడు. కళ్లు చూసాడు. ఎర్రగా ఉబ్బివున్నాయి. ముఖంనిండా నిద్రమత్తు శరీరం స్వాధీనం తప్పినట్లు ఊగుతుంది.

'నేను సిమ్లా బయలుదేరాను' చెప్పాడు.

'ఎందుకు?'

'నీకోసం.'

'నేను పూనా బయలుదేరాను. ఎందుకూ అని అడగవేం? రాం కోసం.'

'నేను ఎక్కువ కాలం బ్రతకను.'

'మంచిదే! దైవసాన్నిధ్యంలో వుంటే ప్రశాంతి లభ్యమౌతుంది.'

'నువ్వు ప్రసాదింప కూడదా?'

'అసాధ్యం.'

'అంటే?'

'ఏంలేదు, నువ్వు నా శ్రేయస్సు కాంక్షిస్తావు కదా?'

'అవును!'

'ఒక మేలు చేయి. అంతా తర్వాత చెబుతాను.'

'ఏమిటది?'

'రాంని ఒకసారి ఇక్కడకు తీసుకొనిరా.'

'సుధతో వచ్చాడు. సోమవారం వాళ్ల పెళ్లిట.'

'అందుకే తీసుకురావాలి.'

విశ్వం ఆలోచనలో పడ్డాడు. సిగరెట్టుమీద సిగరెట్టు కాల్చిపారేస్తున్నాడు. ఎంతకీ జవాబు చెప్పలేదు.

'ఏమంటావ్?' హెచ్చరించింది.

లేచి నిలుచున్నాడు. 'తీసుకువస్తాను.' గదిదాటాడు. నెమ్మదిగా వెలుపలికి వచ్చాడు. ఆమె తూలుతూ లేచింది. వాకిలిదాకా వచ్చింది. అతను వెళ్లిన వైపే చూస్తూ నిలుచుంది. విశ్వం వీధిలో ఉన్న వేలల్లో ఒకడైపోయాడు.

# 4

రాంకిషన్ ఆలస్యంగా నిద్రలేచాడు. ఆవులిస్తూ తన గది తలుపులు తీసుకొని, వెలుపలికి వచ్చి, ప్రక్క గది తలుపు తట్టాడు. సుధ తలుపుతీసింది. లోపలికి నడిచాడు.

చుట్టూ చూశాడు. ఆమె సామానంతా సర్దుకొంది. విచలతుడైపోయాడు. ఏమనటానికి ముఖం చెల్లలేదు.

'బాగా నిద్రపట్టిందా రాత్రి?'

'ఆ తమ దయవల్ల!'

'రాత్రి డిన్నర్ దగ్గర బాధ కలిగించానా?'

'లేదు.'

'రాత్రి ఎంతోసేపు తలుపుతట్టాను, తీయలేదు. నిద్రపోయి వుంటావనుకున్నాను.'

'లేదు. మెలుకువ వుండే తలుపుతీయలేదు.'

'కోపమా.'

'ఆఁ!'

ఆమె ముఖంలోకి చూశాడు. అశాంతి కనుపించింది రాం చలించిపోయాడు. బాధతో అడిగాడు.

'సామాను సర్దావు?'

'ఊరెళుతున్నాను. సెలవు పూర్తికాగానే డ్యూటీలో జాయిన్ అవుతాను.'

'అంటే?'

'మీ యిష్టంవచ్చినట్లు మాట్లాడితే వినడానికి కాదు వచ్చింది.'

'తాగిన తొందరలో ఏమేమో అన్నాను. క్షమించు సుధా!'

'ఇప్పుడే ఇలా మాట్లాడిన మీరు పెళ్లయింతర్వాత ఇంకా ఏమంటారో?'

'పొరపాటు మన్నించమని ప్రార్థిస్తున్నాను.'

'ప్రార్థించటం కాదు.'

'మరి.'

'తాగనని ఒట్టు వేయాలి.'

'ఒట్టు తాగను.'

'దైవ సాక్షిగా ఇంకెప్పుడూ తాగను'

సుధ ముఖంలో చీకటి మాయమయింది. సూర్యోదయ మయింది. ఆనంద రేఖలు ముఖంమీద దోబూచులాడాయి. తృప్తిగా గాలి పీల్చుకొంది. రాం మీద ఆమెకంత నమ్మకం.

'ప్రయాణం మానుకొంటావు కదా?'

'ఆఁ!'

తలుపు తట్టిన ధ్వని. రాం తీశాడు విశ్వాం ప్రవేశించాడు.

'విశేషాలు విశ్వాం.?

'ఉన్నాయి!' అలా వెలదాం. అన్నట్టు సైగ చేశాడు.

'మీరు వెళ్లొద్దు' రాంతో చెప్పింది, 'చెప్పండి' విశ్వాంను అడిగింది.

విశ్వాం సంతోషించాడు.

'ఫర్వాలేదు చెప్పు.'

'హేమ్ వచ్చింది. హొటల్లో వుంది. వెంట తీసుకు రమ్మంది వెలదామా?'

క్షణం తటపటాయించాడు. మరు క్షణంలో నిర్ణయించు కొన్నాడు. 'వస్తాను' బయలు దేరాడు.

‘వెళతారా?’

‘ఆఁ!’

‘వద్దు!’

‘నీకు ఏ శంకావద్దు సుధా? నేను ఇప్పుడే వస్తాను నీకు ఏ భయమూ కక్కరలేదు. నిశ్చింతగా వుండు!’

ఆమెకు రాం అలా వెళ్లాలనుకోవడం ఇష్టంలేదు. వెళితే సహించ లేదు. అది రాంకి కూడా తెలుసు.

‘మీారిప్పు డిక్కణ్ణుంచి వెళితే, ఇంకో క్షణంలో ఈ ఊరు నుంచి నేనూ వెళతాను.

‘వద్దు నా మాట విను. వస్తాను, ఇక్కడే వుండు.’ విశ్వం రాం బయలుదేరారు. కసిగా దభీమని తలుపు వేసుకొంది, సుధ.

# 5

విశ్వం వాకిలి తట్టాడు. ఎవరూ తీయలేదు. మళ్లీ మళ్లీ మళ్లీ తట్టాడు. చివరికి బోల్టు తీసిన ధ్వని వచ్చింది. నెమ్మదిగా వాకిలి తొలగింది. హేమ్‌సక్సేనా తలుపుతీసి తూలుతూ సోఫాలో పడింది. కళ్లు గోళీల్లాగా తిరుగుతున్నాయి. కళ్లులాగే వళ్లు స్వాధీనంలో లేదు.

‘వచ్చారా?’ యథాలాపంగా పలికింది. ‘రారేమో ననుకున్నాను’ మూలిగినట్టు చెప్పింది. ‘నేనే వద్దామను కుంటున్నాను అడ్రస్ తెలియదు. వచ్చారుగా అదే పదివేలు, కూర్చోండి, నిలబడ్డా రేం?’

కూర్చున్నారు.

‘విస్కీ ఇచ్చేదా?’

‘వద్దు!’

‘టిఫిన్ తీసుకొన్నారా?’

‘పూర్తయింది.’

‘మీతో మాటాడాలని పిలిపించాను. పూనా వెళ్లి, వస్తున్నా.’

‘తెలుసు!’

‘పెళ్లిట!’

‘అవును!’

‘సుధ పిచ్చిపిల్ల! దాంతో మీరేం సుఖపడతారు నా మాట విని...’

‘నోర్ముయ్! ఇందుకేనా పిలిపించింది.’

‘కొంత ఇందుకే!’

‘ఇంక ఆ విషయం ప్రస్తావించవద్దు. ఇంకేమయినా వుందా?’

‘ఉంది!’

‘చెప్పు మరి! వెళ్లాలి. సుధ ఎదురు చూస్తూ వుంటుంది సిగరెట్టు కూడానా?’

గదినిండా చెల్లాచెదురుగా వున్న సిగరెట్లు చూస్తూ అడిగాడు.

‘లేదు!’

‘మరి ఇవ్వి?’

‘విశ్వం కాల్చాడు.’

‘నేను కాల్చలేదు’ విశ్వం చెప్పాడు.

‘విశ్వం అబద్ధమాడితే అదేమీ ఉపయోగించదు.’

'నాకేమవసరం' విశ్వం పలికాడు.

'ఎవడితో వచ్చావు?'

'ఎవడితోనూ రాలేదు. నీ కోసం వచ్చాను. అయినా ఎవడితో వచ్చానో చెప్పవలసిన అవసరం ఏమీలేదు. నువ్వేమైనా నా ప్రియుడివా? భర్తవా? నీకు అన్నీ చెప్పడానికి నువ్వు వినడానికి—అయినా నీకేం హక్కువుందనన్నిలా అడగటానికి, అడిగినా చెప్పే అవసరం నాకేమీ లేదు. చెప్పే అవసరం ఉంటుంది. ఎప్పుడు? నీకూ నాకూ చెప్పవలసిన సంబంధంవుంటే! లేదా వుంటుందనే స్థితి అయినా ఉంటే! చెప్పు! నీకు చెప్పవలసిన అగత్యం వుంటుందంటావా?'

'లేదా?'

'సుధను పెళ్లాడితే లేదు. పెళ్లాడక పోతే వుంటుంది. నన్నే పెళ్లాడితే అధికారం హక్కు—అడగటానికి చెప్పడానికి వినడానికి వుంటాయి.'

'అదంతా అనవసరం సిగరెట్ పీకలు ఎవరు కాల్చినది?'

'తాగి తూలుతూ పేలుతున్నాననుకుంటారు. నిజం మీకు అర్థం కాదు. చెప్పినా నమ్మలేరు. మీ కళ్లకు పచ్చటి పొర అడ్డుపడింది. లోకం అంతా పచ్చగా వుంటుందను కుంటారు. అనుమానం' అపనమ్మకం, మీ ఆత్మా, హృదయం, మంచితనం కనుపించదు. చెడు కనుపిస్తుంది. ఎంతో దూరంనుంచి వచ్చాను. సిగరెట్ పీకలు మీకు కనుపించాయి. మురికి, చెత్తా, చెదారం, రోత తప్ప ఏమీ కనుపించవు. సిగరెట్లు నేను తాగలేదు. ఎవడూ ఇక్కడికి రాలేదు. విశ్వం తప్ప వచ్చే అర్హత ఎవడికీ లేదు. మీకుంది.

మీరది కోల్పోతే చెప్పేదేమీ లేదు. పూలమాలలో దారం వుందని ఏడ్చే బాపతు మీరంతా! స్త్రీని సౌంధర్యవతిని- మీకోసం ఎంతో దూరంనుంచి, శ్రమభరించి, వెతుక్కుంటూ వచ్చినదాన్ని—చూచే సమయంలో మీకు పీకలూ, ఈకలూ తప్ప నిజాయితీ, అన్వేషణ, మమత, హృదయం కనుపించవు మీకు పశువులకూ తేడా ఏముంటుంది??

'ఏపశువు ఏ సైతాన్ దగ్గర ఏడిస్తే ఎవడకేం గానీ నన్నెందుకు రమ్మన్నావ్.'

'ఒంటరిగా మాట్లాడాలి'

విశ్వం తల వంచుకున్నాడు. నెమ్మదిగా బయటి నడిచాడు.

'నా హృదయం నన్ను మోసం చేయదు' హేవ్ పలికింది.

'కావచ్చు.'

'హృదయపూర్వకంగా మిమ్మల్ని ప్రేమిస్తున్నాను.'

'తెలిసిందిగా!'

'మీరే నాకు భర్త కావాలి.'

'అసాధ్యం'

'అలా అంటే వీల్లేదు. మిమ్మల్ని నమ్ముకొని ఇంతకాలం జీవించాను!'

'నిజమే కావచ్చు ఇక నన్ను మరచిపో శాశ్వతంగా మరచిపో! కలలోకూడా నన్ను స్మరించవద్దు. ఈ విషయం వ్రాద్దామనుకున్నాను. ఇష్టంలేక పోయింది. నా పెళ్లికి ముందు నాకీ విషయం చెప్పకుండా వుండటం నీకు మంచిదికాదు

అనుకోకుండా ఇక్కడికి వచ్చావు. చెప్పి వెళ్లడంకోసం వచ్చాను. పూర్వ పరిచయం పురస్కరించుకొని, ఇద్దరి శ్రేయస్సు కాంక్షించి చెపుతున్నాను. నన్ను మరచిపో శాశ్వతంగా పూర్తిగా మరచిపో!' వస్తాను.

'వద్దు! — మీరు వెళ్లవద్దు. బ్రతిమాలుకొంటున్నాను. ఉండండి. నన్ను చంపి మరీ వెళ్లిపొండి. ఉండరా?'

'వీల్లేదు. అక్కడ సుధ ఎదురుచూస్తూ వుంటుంది. వెళ్లాలి.'

'నేను ఎంతోకాలం ఎదురు చూస్తువున్నాను నా నిరీక్షణకు ప్రతిఫలం ఇదేనా?'

'లేదు వెళతాను!' లేచి నిలబడ్డాడు. ఆమె లేచి దగ్గరకు వస్తూవుంది. రాం తలుపుదగ్గరకు నడచాడు. ఆమె తూలుతూ వచ్చింది. చేతులు పట్టుకుంది. విడిలించాడు. మెడ వాటేసుకొంది. జారలాక్కున్నాడు. గుండెమీద తల పెట్టు కుంది. తప్పుకున్నాడు. కోటు పట్టుకుంది. విడిపించుకొన్నాడు, కాళ్లమీద పడింది. ఎడంగా జరిగాడు. కాలుపట్టుకుంది. బలంగా లాక్కున్నాడు. ఆమె ఏడుపు ముఖంతో నేలమీద నుంచే ముఖంలోకి చూచింది. వాకిలి తీసుకొని చరచరా వెళ్లిపోయాడు. ఆమె ఏడుపు రాంకి త్రోవ పొడుగునా వినబడుతూ వుంది.

# 6

విశ్వం తలుపు నెట్టుకొని లోపలికి వచ్చేసరికి, నేలమీద పొర్లి పొర్లి కుమిలి కుమిలి ఏడుస్తూ హేమ్‌సక్సేనా కనుపించింది. కళ్లవెంట ధారా పాతంగా అశ్రుపాతం!

అతన్ని చూచి తీగలాగా ఊగింది పులిలాగా లేచింది. జ్వాలలాగా జ్వలించించి.

'ఎందు కొచ్చావ్? ఇక్కడి కెందుకొచ్చావ్?' కోపంగా గుడ్లెర్రజేస్తూ అడిగింది.

ఆమె ఆశతో వచ్చింది. ఆశ ఫలించబోయింది. అందమైన ఆమె రాం కోసం చక్కగా అలంకరించుకొంది. తాగి తూగుతూవుంది. కళ్లు విచిత్రంగా వున్నాయి. వళ్లు వంకరలు తిరుగుతూ వయ్యారాలు పోతూవుంది. నిరాశతో నిండి పోయివుంది. రాం తిరస్కృతివల్ల ఏడుపు వచ్చింది. బాధతో పండిపోయింది. ఏడుస్తుంటే విశ్వాం చూశాడని లజ్జ కలిగింది. విశ్వాంమీద కోపం వచ్చింది. ముఖంలో అనేక రకాల భావాలు విచ్చిలవిడిగా చెలరేగుతున్నాయి. అంతరచాహిత కల్లోపోలు, ఆశ నిరాశలు, వత్తిడులు, తొందరలు, ఆవేశం చిందర వందరగా చుట్టు ముట్టివున్న భావశబలతతో హేమ్ చాలా అందంగా కనిపించింది. ఇటువంటి అందం, ఇంత విశిష్టమైన అందం ఎవరూ, ఎవ్వరూ, ఎప్పుడూ చూడలేరు. తను చూడగలిగానని, పరమానందంతో జీవితాని కంతటికీ ఈస్థితి ఒక్కటే చాలునని, తల మునకలైపోతున్నాడు విశ్వాం.

'చెప్పు ఎందుకొచ్చావ్!'

'నీకోసం'

'నాకోసం, నాకోసం, సిగ్గులేదూ?'

'ఏమైనా అను'

'అబద్ధాలెందు కాడేవ్?'

'నీకోసం'

'ఛీ! నన్ను మరచిపొమ్మని ఎన్నిసార్లు చెప్పాను.'

'నన్ను మరచిపొమ్మంటున్నరాంని నువ్వు మరచిపో గలుగు తున్నావా హేమ్.'

'నా ఆశనాది'

'అలాగే నాకూ ఆశలు!'

'నీకు ఆశలేంటి టి. బి. రోగివి.'

విశ్వం మాట్లాడలేక పోయాడు. మనిషిలోపల బలహీనత ప్రవేశించింది. తూలు వచ్చినట్లు అయింది. నెమ్మదిగా సోఫాలో కూర్చున్నాడు.

'ఎందు కిక్కడ కూర్చుంటావ్?'

'దయచేసి కూర్చో హేమ్.'

రెండు క్షణాలు తట పటాయించింది.

ఎదురుగా కూర్చుంటూ 'ఏం' అంది.

'నేను రోగినే! నువ్వు అన్నా అనకపోయినా రోగినే! చనిపోనూ వచ్చు. అందరూ చనిపోయె వాళ్ళేకదా? చనిపోయే దాకా జీవించాలిగా? జీవిస్తుంటే కోర్కెలు ఆశలు సహజ మేగా! ఏమి తెలియందానివి కాదుకదా? నన్ను అర్థం చేసుకోలేవా?'

'ఆశకు హద్దుండాలి?'

'ఆశకే కాదు, 'హేమ్' దేనికయినా హద్దుండాలి.

కారణం లేకుండా నేను నిన్ను ప్రేమించలేను. పిచ్చివాణ్ణి కాలేను. నాలోని ఆశల్ని రెచ్చకొట్టావు.

'నా తప్పులేదు. నా విధిని నువ్వు అర్థం చేసుకొన్నావు. నీలోనువ్వు గాలిమేడలు కట్టుకొంటే అందులో నివసించవలసిన అవసరం నాకేమీలేదు.

ఆకస్మికంగా విశ్వం హృదయంలో మెరుపు మెరసినట్లు అయింది. ఆమె ముఖంలో క్రొత్త అందం కనుపించింది. తన్మయత్వంతో చూస్తూ వున్నాడు.

ద్రవీభూతమయిన ఆమె హృదయం గడ్డకట్టడం ప్రారంభమయింది. కన్నీరు తుడుచుకుంది. కఠినశిల అయిపోయింది.

'విశ్వం నాకు పనుంది. నువెళ్లవచ్చు.'

ఆ మాట విశ్వం గుండెమీద వజ్రాయుధం అయింది. విలవిలలాడుతూ లేచాడు. 'అలా అనొద్దు హేమ్!' అనొద్దు దయచేసి కూర్చో.'

ఆమె సోఫామీద అలాగే కూర్చుంది. విశ్వం లేసి కొంచం ఎడంగా క్రింద కూర్చున్నాడు.

'అలా అనొద్దు అంటే బ్రతకలేను బ్రతకలేను హేమ్ నన్ను ప్రేమించలేకపోయినా జాలి తలచి అయినా మాటలతో చంపవద్దు' బ్రతిమాలుకొన్నాడు.

'వెళ్లవతలకి!' కఠినంగా కసురుకొంది.

విశ్వం ఆమె కాళ్లు పట్టుకొన్నాడు. 'ఏమన్నా చేయి! తిట్టు కొట్టు ఏమయినా సరే వెళ్లమని మాత్రం అనవద్దు. నాకెవరున్నారు నువ్వు తప్ప! అన్నింటికి నువ్వేనని నమ్ముకున్నాను. రాం తిరస్కరిస్తే కుమిలిపోయావు. నువ్వు తిరస్కరిస్తే మరణిస్తాను. ప్రేమ తిరస్కారం సహించలేదు. రెండు తిరస్కృతీ హృదయాలు ఆనందం ఎందుకు పొందకూడదూ! చెప్పు హేమ్.'

కాళ్లు దగ్గరకు లాక్కుంది. 'నాకేమీ చెప్పవద్దు! వెళ్లు వెళ్లు!'

పోను—పోలేను. ఎన్నో ఏళ్లగా నిన్ను ప్రేమిస్తున్నాను. ఎదుటబడి చెప్పలేకపోయెను. ఉత్తరాలకు జవాబు వ్రాయ లేదు నువ్వు, నాకు ఆరోగ్యం కలిగినప్పుడు చెప్పుకుందామని ఆగాను. ఇప్పుడు తెలిసింది. నా జబ్బునయంకాదని, మరణం తప్పదని, బలహీనమైన గుండెలు ఈ ప్రేమ బరువు భరించ లేవు హేమ్. చెప్పుకొని హాయిగా మరణించాలి. అందుకే నా ప్రయాస!'

'నాకు పనుంది' హేమ్ లేచింది. లోపలకి పోబోయింది. విశ్వం వెంటనే లేశాడు. అడ్డంగాపోయి నిలబడ్డాడు. 'ఆగు హేమ్' ఆమె ముఖంలోకి చూచింది.

'నన్ను వెళ్లమనొద్దు.'

'ఛీ! వెళ్లవతలికి!' బలంగా నెట్టింది. వాకలిదగ్గర చెండు లాగా పడ్డాడు.'

'నాకు అమ్మా నాన్నా లేరు. అక్కా చెల్లెళ్లు లేరు. అన్నాదమ్ముళ్లు లేరు, భార్యాపిల్లలు లేరు, బంధువులు లేరు, ఒంటరివాణ్ణి. ఒంటరిగా వెళిపోతున్నాను. కాని నిన్ను ప్రేమించాను. నువ్వు అంగీకరిస్తే అందరూ వున్నంత ఆనందం లేకపోతే సహింపలేని క్షోభ. నిన్ను పెళ్లి చేసుకోవాలను కొన్నాను ఒకనాడు. ఇప్పుడనుకోవటం లేదు. ప్రేమకోసం ప్రేమింపబడాలని కోరుకొంటున్నాను. తృణీకరించకు హేమ్!'

'నీకు ప్రేమేమిటి ఛీ! వెళ్లు! నా ప్రేమ నాశనం చేశావ్!

'నాకీ జబ్బు లేకపోతే నీ ప్రేమకు నేను అనర్హుడను కాదు. కానీ ఈ టి.బి. మూలంగా నువ్వు నన్ను తిరస్కరిస్తున్నావు. అంటే ఏమయినా కానీ నేను చనిపోయే ముందు, నేను

ప్రేమించిన ప్రాణి నన్ను ప్రేమించిందని తెలిసి, నా కోసం ఒకటి కన్నీటి బిందువయినా రాల్చగల ప్రాణి వుందని గుర్తించి మరణించటం ప్రశాంతంగా వుంటుంది హేమ్. ప్రేమించాననూ. లోకంలో నేను సంపాదించుకో దలచిన సర్వం నా కోసం నీ ఒక్క కన్నీటి బిందువు అనుగ్రహింపవూ?' లేచి నిలబడ్డాడు.

'ప్రేమించాననాలా? ఛీ! పో!' మళ్లీ నెట్టింది. తలుపుమీద పడ్డాడు. క్రింద పడకుండా నిలద్రొక్కుకున్నాడు.

'ప్రేమించానను వెళ్లిపోతాను. ప్రేమించానను, అను.

'నిన్నా? నిన్నా? ఛీ! తలుపు మూసింది.

'ప్రేమించాననవూ? అనవూ?' బిగ్గరగా అరిచాడు. దగ్గు వచ్చింది. విరామం లేకుండా దగ్గాడు. దగ్గుతూ వణికి పోయాడు. దగ్గుతో పాటు బుళక్కున రక్తం వచ్చింది. ఉమ్మి వేశాడు.

'పో!' నెట్టింది. తలుపు వెలుపలపడ్డాడు. దగ్గు ఎక్కువయింది. హేమ్ వాకిల వేసింది. సోఫాలో పడి వెక్కి వెక్కి ఏడుస్తుంది.

ఆమె చెవుల్లో విశ్వం దగ్గు కణేక్ కణేక్‌మని వినిపిస్తూ వుంది.

# 7

విశ్వం గదిలోకి వచ్చేసరికి సుధారాణి శోక దేవతలాగా కనిపించింది. కళ్లు ఉబ్బి ఉన్నాయి. చెక్కిళ్లు వణుకు తున్నాయి. ఆమె ఉగిసలాడుతూ వుంది.

'రాం ఎక్కడ? కోపంగా అడిగింది.

'రాలేదా? ఎక్కడికి పోయాడో ఏమో!'

విశ్వం బట్టలనిండా రక్తం మరకలు నోరు రక్తం చలిమలాగా వుంది. 'ఆమె తన గదిలోనే వుంది రాం లేడక్కడ'.

దగ్గుతెర వచ్చింది. విపరీతంగా దగ్గాడు. గుండె పట్టుకొని వంగిపోయాడు. కూర్చున్నాడు. రక్తం పడింది. బట్టలమీద నేలమీద పడిపోయింది.

'నువ్వెందుకొచ్చావిక్కడికి?'

'రాం కోసం!'

'లేరు వెళ్లు'

'నిజంగానా?'

'అబద్ధాలాడే వెధవబుద్ధి లేదు నాకు.'

విశ్వం గుండెల్లో కత్తిలాగా చొరబడిందా మాట! విలవిల లాడిపోయాడు.

'రాం వచ్చిందాకా వుంటాను.'

'వీల్లేదు వెళ్లిపో'

'హేమ్‌ని మనసారా ప్రేమించాను.'

'నువ్వు ప్రేమించిన స్త్రీ దగ్గరకు పరాయి మగాడిని తీసుకు పోయే నువ్వు ప్రేమించటమా? నువ్వు మగాడివేనా?'

విశ్వం మాటాడలేక పోయాడు. ముఖంలో కత్తివ్రేటున నెత్తురు చుక్క లేదు.

'ఇదేనా మగతనం?'

'నువ్వూ నన్నర్థం చేసుకోలేదు.'

'ఛీ! నువ్వొక మనిషివే. నిన్నొకరు అర్థం చేసుకోవాలి వెళ్లు!'

'మిస్ సుధారాణీ! దయతలచి నన్ను వెళ్లమనొద్దు.'

'వెళ్లమనక? ప్రశాంతంగా సాగే మా జీవితాలలో అశాంతి రేకెత్తించావు. శుభం కోరివస్తే అశుభంలాగా ఎదురయ్యావు. నన్నూ నా రాంని వేరుచేశావు. ఇంకా ఏంచేద్దామని ఇక్కడ ఉంటావు! వెళ్లు!'

విశ్వం కృంగిపోయాడు, తలవాల్చుకొనే చెప్పాడు. 'పొరపాటు అయితే క్షమించు.' నీ మంచి కోరి తప్పుచేశానేమో మన్నించు. నన్ను వెళ్లమనొద్దు నిలువ నీడలేని అభాగ్యుణ్ణి చెయ్యొద్దు నన్ను. ఇంక—ఇంక జీవితంలో ఎవరికీ ఏ కష్టమూ కలుగదు. రాంని చూసి వెళతాను.

దగ్గువచ్చింది. సాగలాగిన రబ్బరులాగా అయిపోయాడు, గుండెనిండా ముళ్లకంప. గొంతులో ఇనుం ముళ్లు.

'రాంని చూడడానికి వీల్లేదు. చూసే అర్హత అవసరంలేదు. వెళ్లు.'

'నీలోనూ కాఠిన్య వుందా?' దగ్గాడు 'నువ్వూ పొమ్మంటున్నావా?' దగ్గాడు. 'అందరికీ నామీదెందుకు కసీ?' దగ్గాడు. 'నా జీవితం ఎందుకిలా అయింది' దగ్గాడు. రక్తం పడింది. నోరు తుడుచుకొన్నాడు, చేతికి రక్తం మరక అయింది. కళ్లవెంట నీళ్లు తిరిగాయి. సుధ ముఖంలోకి చూశాడు.

'స్త్రీకి బాధలోవున్న మనిషిని బాధపెట్టటం ఇష్టం ఉండదని అనుకొన్నా నింతకాలం. నా అభిప్రాయం తప్పని ఇప్పుడే తెలుస్తూవుంది. బాధతోవున్న మనిషిని ఎవరో బాధపెడితే కారణాంతరాలవల్ల కొంత ధర్మంవుంది. రోగిని నర్సు బాధపెట్టవచ్చా? అందులోనూ మిలిటరీ వేషంటుని, మిలిటరీ

నర్సింగు ఆఫీసరు బాధపెట్టవచ్చా? [illegible] వాడిని ఈ విధంగా నేనా చూడవలసింది. నాకు ఆనందం కావాలని కోరుకోవటం లేదిక్కడ. కష్టం కలిగిరావద్దని ప్రార్థిస్తున్నాను. ఆమాత్రం దయలేదా? సుధా!....

కడప - 516 004.

'నోర్ముయ్, వెళ్లు.'

'మామూలు మనిషి రక్తం కళ్లజూచినా స్త్రీ చలించిపోతుం దంటారే, రోగి—టి.బి. పేషంట్ మరణావస్థలోవున్న టి.బి. పేషంటు రక్తం కక్కుకుంటూవుంటే దయ చూపవలసింది పోయి, కర్కశత్వం చూపటం న్యాయమేనా? ఇదేనా మానవత్వం.'

'ఎక్కువగా అరవకు వెళ్లవతలకి' తీక్షణంగా చెప్పింది.

'నేను పోను—నాకెవరూ లేరు. ఈ లోకంలో వంటరిగా జీవించలేను. వీధిలోవున్న వేలాది జనంమధ్య విచ్చలవిడిగా తిరిగే వంటరితనంలో బ్రతకలేను, నేను పోను.'

'పోతావా లేదా?' మీదకు వచ్చింది.

'నీకు నమస్కారం చేస్తాను. నన్ను తమరవద్దు అమాను షత్వానికి బలిచేయవద్దు. నన్నుండనీయ్.'

'లే!' చొక్కా పట్టుకొంది. ఊలచెండులాగా పైకిలేచాడు.

'అంతా అంధకారంగా వుంది చెల్లీ నన్ను కొట్టవద్దు ప్రార్థిస్తూ వున్నాను.'

ఆమె ఏమి వినిపించుకోలేదు. 'పో' అంటూ నెట్టింది. తూలుతూ తలుపుమీద పడ్డాడు.

'రోగిని, శరీరం, మనస్సూ స్వాధీనం తప్పినవాణ్ణి—ఇప్పటికే చచ్చిపోయినవాడిని ఇంకా చంపకు చెల్లీ! చెల్లీ!! చెల్లీ!!!'

విశ్వం భయపడ్డాడు. వణికిపోయాడు. సుధ చంపుతుం దేమో ననుకున్నాడు.

సుధ నిలబడిపోయింది. మూాడు క్షణాలు కళ్లల్లో ఏదో ప్రశాంతి తొంణికిసలాడింది. కూర్చోమని అనబోయింది. అంతలో ఏదో భయం కలిగింది. పొమ్మనలేకపోయింది. మాటలురాని మూగబొమ్మలా కూర్చుండిపోయింది.

'చెల్లీ కూర్చోనా? వెళ్లిపోనా? కూర్చుంటే నా కిష్టం లేకుండా, చంపుతావనిపిస్తుంది. వెళ్లితే ఎక్కడికి వెళ్లాలో తెలియటంలేదు. కూర్చోనా?'

సుధ మాట్లాడలేదు.

ఆమెలో రెండు రకాల భావాలు తలెత్తాయి. ఆ భావాం దోళనలో ఏమీ మాట్లాడకుండా పోయింది.

'పోనా?—ఉండమంటే వుంటాను—చెప్పు చెల్లీ.'

ఉండమనలేకపోయింది. పొమ్మని అనలేదు. రాం గుర్తుకు వచ్చేసరికి భయం వేసింది.

'చెల్లీ నువ్వుండమంటంలేదు. నీ భయం నాకర్థమయింది. నేనెవరికి కానివాడిని అయ్యాను. నాకు కూర్చునే చోటు కూడా లేదు. నాకు లోకంలేదు. ఈ లోకం నాదికాదు. ఏమీలేదు. ఎవరూలేరు. ఒంటరివాణ్ని. భయంకరంగా ఒంటరివాణ్ణి. భగవాన్ ఏమిటి నాకీ శిక్ష! నేనేం ద్రోహం చేశాను నీకు' కళ్లువెంట నీళ్లు తిరిగాయి. దగ్గుతెరవచ్చింది. దగ్గుతూ చెప్పాడు 'శాశ్వతమైన ఈ దగ్గుసాక్షిగా కాదు. దేవుడున్నాడో లేడో తెలియదు. దగ్గు వుండటం నిజం. దగ్గుసాక్షిగా చెపుతున్నాను. నేనెవరికి అపకారం చేయను.

చేయాలని తలంపూ లేదు, నే నిక్కడ వుండటం నీ కపకారమే అవుతుంది. అది ఇంతసేపూ నేను ఆలోచింపలేదు. అందుకే వెళుతున్నాను. శాశ్వతంగా వెళుతున్నాను. వస్తాను.'

సుధ ఉండమనలేదు. మాట్లాడకుండా కూర్చుంది. నమస్కరించి విశ్వం దగ్గుతూ బాధతో వెళ్లిపోయాడు. సుధ కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ తన గదిలో కూర్చుంది.

* * * *

ఆ రోజు రాత్రిదాకా రాంకిషన్ గదికి రాలేదు. సుధ హృదయం కల్లోలితమైపోయింది. రాత్రికి సామాను సర్దుకొని రైలెక్కింది స్వగ్రామానికి టిక్కెట్టు తీసుకొని.

* * * *

రెండో రోజు దినపత్రికలో వార్త:

'మిలిటరీ హాస్పిటల్ వార్డ్‌నుంచి పారిపోయిన టి.బి. పేషంట్ కెప్టెన్ విశ్వం బొంబాయిలో చర్చి రోడ్డులో తప్ప తాగి పడి చనిపోయాడు.'